నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

అంబర్‌పేట, జనవరి 21 : చెట్ల నరికివేత పనుల కారణంగా ఈ నెల 22వ తేదీ బుధవారం నల్లకుంట డివిజన్‌లోని 11కేవీ శివం పాక్షిక ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు శివం, టీఆర్టీ కాలనీ, విద్యానగర్ రైల్వేస్టేషన్, పరిసర ప్రాంతాలలో కరెంటు సరఫరాను నిలిపివేయనున్నట్లు సీబీడీ-సీ2 ఏడీఈ జి.నాగేశ్వర్‌రావు తెలిపారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

అంబర్ పేట డివిజన్ బాపునగర్‌లో మంగళవారం స్థానిక కార్పొరేటర్ విజయ్ కుమార్‌గౌడ్ పర్యటించారు. బాపునగర్‌లో కొత్తగా ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. కార్పొరేటర్ వెంట స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

– గోల్నాక, జనవరి 21

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

మెహిదీపట్నం పశ్చిమ మండలం ఆర్టీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రోడ్డు భద్రతా మాసోత్సవాలలో పాల్గొన్న భారత క్రికెటర్ సిరాజ్, ఆర్టీవో రవికుమార్ తదితరులు

మెహిదీపట్నం, జనవరి 21 : రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ప్రతి ఒక్కరూ వాహనాలను బాధ్యతతో నడపాలని, ట్రాఫిక్ నియమనిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని భారత క్రికెటర్ సిరాజ్ అన్నారు. మంగళవారం మెహిదీపట్నం పశ్చిమ మండలం ఆర్టీవో కార్యాలయంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారత క్రికెటర్ సిరాజ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ.. రోడ్లపై ప్రయాణాలను చేసేటప్పుడు ప్రతి ఒక్కరూ వాహనాలను అప్రమత్తంగా నడపాలని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించి వాహనాలను నడిపితే ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో అధికారి జి. రవికుమార్, ఎంవీఐలు సింగం శ్రీనివాస్, సి.శ్రీనివాస్ రావు, వెంకట సురేశ్, ఏఎంవిఐలు డి. అఖిల, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్కులను అన్ని విధాలుగా అభివృద్ధి చేశా

సీతా కాలనీలో పార్కు అభివృద్ధి పనులను
కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డితో కలిసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, జనవరి 21: అంబర్‌పేట నియోజకవర్గంలోని అన్ని పార్కులను అందంగా తీర్చిదిద్దినట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ పార్కులో రూ.6 లక్షలతో చేపట్టనున్న మరమ్మతు, సుందరీకరణ పనులను డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డితో కలిసి ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని బర్కత్‌పుర హౌసింగ్ బోర్డు కాలనీ పార్కు, నల్లకుంటలోని మోత నాగేశ్వర్‌రావు పార్కు, నరేంద్ర పార్కు, గోల్నాకలోని తులసీనగర్ కాలనీ పార్కు, బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని సోమసుందర్‌నగర్ పార్కు, వైభవ్‌నగర్ పార్కులను అన్ని విధాలుగా అభివృద్ధి చేశానన్నారు. పార్కులను సుందరీకరించినట్లు పేర్కొన్నారు. వీటి అభివృద్ధికి కొన్ని కోట్లు వెచ్చించడం జరిగిందని అన్నారు. అలాగే సీపీఎల్ రోడ్డును కూడా సుందరంగా తీర్చిదిద్దామని తెలిపారు. ఫీవర్ హాస్పిటల్ బ్రిడ్జి వద్ద రెండు వైపుల కూడా అందంగా తయారు చేశామన్నారు. పార్కులనే కాకుండా నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలో అభివృద్ధి పనులు చేసినట్లు వెల్లడించారు. పెండింగ్‌లో ఉన్న పనులపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. సీతా కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణరాజు, ప్రధాన కార్యదర్శి పడాల వెంకట్రావు, కోశాధికారి సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ సుధాకర్‌రావు, ప్రతినిధులు సత్యం, నాగేశ్వర్‌రావు, పార్థసారథి, సాంబమూర్తి, సంగీత, ఉషా, శైలజ, మోనరిలేకర్, జ్యోతిరెడ్డి, జ్యోతిర్లతలతో పాటు బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రమోహన్, సీనియర్ నాయకులు వి.రవీందర్‌రావు,అరుణ్‌కుమార్‌రెడ్డి, శ్రీరాములుముదిరాజ్, అఫ్రోజ్‌పటేల్, పి.గెల్వయ్య, టి.రమేశ్, మిర్యాల రవీందర్, మిర్యాల శ్రీనివాస్, ఉప్పు సుధాకర్, గోవిందు అర్జున్, శ్రీహరి, ఎన్.వెంకటరమణరాజు, బంగారు శ్రీను, బొట్టు శ్రీను, నవీన్‌యాదవ్, సాయి పాల్గొన్నారు.

కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలుచేయాలి

కాచిగూడ,జనవరి 21: రాష్ట్రంలోని బీసీలకు ఎన్నికల ముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలుచేయాలని కోరుతూ మంగళవారం కాచిగూడ టూరిస్ట్ హోటల్ సర్కిల్‌లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో 54 శాతం ఉన్న బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ బీసీల అభ్యున్నతికి పాటుపడాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి కుటుంబ సర్వే నివేదికను తక్షణమే ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతం వరకు పెంచుతామని రాహుల్‌గాంధీ హామీ ఇచ్చాడని, వెంటనే అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు. ఈ కార్యక్రమంలో పూలిజాల కృష్ణ, ముత్యాల్‌రావు, డాక్టర్ ప్రశాంత్ నిమ్కర్, భాస్కర్, ప్రదీప్‌గౌడ్, కిశోర్‌గౌడ్ పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న జాతీయ బీసీ
మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ తదితరులు

గుడిమల్కాపూర్ మార్కెట్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం

మార్కెట్ కార్యాలయంలో కార్యదర్శి శ్రీనివాస్, ఇతర అధికారులు,
సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేశ్‌ముదిరాజ్

కార్వాన్, జనవరి 21: గుడిమల్కాపూర్ మార్కెట్‌లను అన్ని విధాల అభివృద్ధి చేయడంతో పాటు రైతుల సమస్యలు, వినియోగదారుల ఇబ్బందులను పరిష్కరించి సౌకర్యాలు మెరుగుపరుస్తానని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేశ్ ముదిరాజ్ అన్నారు. మార్కెట్ కార్యాలయంలో మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బందితో కలిసి మంగళవారం తన చాంబర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించి మార్కెట్ స్థితిగతులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గుడిమల్కాపూర్ మార్కెట్‌లో హోల్‌సేల్, రిటైల్ కూరగాయల మార్కెట్‌లతో పాటు పూలమార్కెట్ కొనసాగుతున్నదని తెలిపారు. మార్కెట్‌లోకి వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని విధాలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతే కాకుండా గత కొంత కాలంగా మార్కెట్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించి మార్కెట్ రెవెన్యూను పెంచేందుకు కృషి చేస్తామని తెలిపారు. మార్కెట్‌లో నెలకొని ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరిస్తానన్నారు. మార్కెట్ రెవెన్యూ పెంపునకు అధికారులు, సిబ్బంది సమిష్టి కృషి చేయాలన్నారు. రైతులు, వ్యాపారులు, వినియోగదారులకు సమస్యలు ఎదురు కాకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. మార్కెట్‌ను మరింత అభివృద్ధి పర్చేందుకు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి పాటు పడ్తానని తలారి మల్లేశ్‌ముదిరాజ్ పేర్కొన్నారు.

యువతకు ఆదర్శప్రాయుడు వివేకానందుడు

అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

రవీంద్రభారతి, జనవరి 21 : యువతకు వివేకానందుడు ఆదర్శప్రాయుడని, ఆయన చూపిన సన్మార్గంలో నడువాలని బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డా. వకుళాభరణం కృష్ణామోహన్‌రావు అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఉజ్వల సామాజిక, స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా వివిధ రంగాలలో విశిష్ట సేవలందించిన వారికి వివేకానంద స్ఫూర్తి అవార్డ్స్ ప్రదానోత్సవం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు విచ్చేసి విశిష్ట సేవలందించిన వారికి అవార్డ్స్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వామి వివేకానందుడు గొప్ప ఆధ్యాత్మిక వేత్త అని ఆయన ఉపన్యాసాలు, రచనల ద్వారా భారతీయ సంస్కృతి, వేదాంతం యోగాలను ప్రపంచానికి పరిచయం చేశారని కీర్తించారు. యువతకు స్ఫూర్తినిచ్చే ఆలోచనలు భారత దేశాన్ని అభివృద్ధి చేయాలనే ఆకాంక్షతో ప్రతి ఒక్కరి హృదాయాల్లో నిలిచిపోయారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేరళ జ్యోతిష్య నిపుణులు శివనరసింహారావు, దైవజ్ఞశర్మ, బాల్‌రాజ్‌గౌడ్, ఆధ్యాత్మిక వేత్త కేశవ్‌గురు స్వామి శ్రీసాయి శాంతి సేవ సమితి చైర్‌పర్సన్ డాక్టర్ ఎర్రం పూర్ణశాంతిగుప్తా, సంస్థ అధ్యక్షురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేపు 'నిన్నే పెళ్లాడతా' హాస్య నాటిక ప్రదర్శన

తెలుగు యూనివర్సిటీ, జనవరి 21: సరసిజ థియేటర్ ఫర్ ఉమెన్, రసరంజని ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి అత్తలూరి విజయలక్ష్మి రచించిన 'నిన్నే పెళ్లాడతా' హాస్య నాటిక ప్రదర్శన పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో జనవరి 23న గురువారం సాయంత్రం 6గంటలకు ఉంటుందని నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మ్యాచ్‌ఫిక్సింగ్ హాస్య నాటికతో విజయభేరిమ్రోగించిన అత్తలూరి విజయలక్ష్మి కలం నుంచి జాలువారిన మరక్ష హాస్య నాటిక నిన్నే పెళ్లాడతా ఆడపిల్లలను భారంగా భావించిన రోజుల నుంచి స్వతంత్రంగా జీవిస్తూ తాము పురుషుల కంటే ఏమీ తీసిపోమని నిరూపిస్తూ సాగే ఈ నాటకం ప్రస్తుత పరిస్థితులకు అద్దంపడుతుందని వెల్లడించారు. పలువురు నాటక రంగ ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు.

తాళ్ల గడ్డలో ప్రారంభమైన కుస్తీ పోటీలు

కుస్తీ పోటీలను ప్రారంభించిన
టప్పాచబుత్రా ఇన్‌స్పెక్టర్ రాములుతో పాటు వస్తాద్‌లు

కార్వాన్, జనవరి21 : తాళ్ల గడ్డలోని రాజలింగయ్య కబడ్డీ స్టేడియంలో 4 రోజుల పాటు ఏర్పాటు చేసిన మడేలా రాజస్వామి రెజ్లింగ్ ఛాంపియన్‌షిన్ కుస్తీ పోటీలు మంగళవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు టప్పాచబుత్రా ఇన్‌స్పెక్టర్ రాములు, ప్రముఖ వెటరన్ రెజ్లర్ సంతోష్ పహిల్వాన్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని కుస్తీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ రాములు మాట్లాడుతూ.. కుస్తీ విద్యతో శారీరక ధృఢత్వం, మానసికంగా ఎదగడంతో పాటు ఆత్మ విశ్వాసం పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జ్ఞానేశ్వర్ పహిల్వాన్, అశోక్ పహిల్వాన్, వెంకటేశ్ పహిల్వాన్, గజేందర్ పహిల్వాన్, అంతర్జాతీయ కోచ్ అనీల్‌మాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్‌లో ఉచిత పార్కింగ్.. కల్పించాలి

రాజాసింగ్ ఎమ్మెల్యే

అబిడ్స్, జనవరి 21: నాంపల్లిలోని ఎగ్జిబిషన్ మైదానంలో సందర్శకులకు ఉచిత పార్కింగ్ సౌకర్యం కల్పించాలని గోషామహల్ ఎమ్మెల్యే టి. రాజా సింగ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాంపల్లిలోని ప్రభుత్వ కళాశాల స్థలంలో సందర్శకుల దగ్గర పార్కింగ్ డబ్బులు ఎలా వసూలు చేస్తారని ఆయన ప్రశ్నించారు. అంతే కాకుండా నగరంలో తీవ్ర ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతున్న క్రమంలో ఎగ్జిబిషన్‌ను నగర శివారు ప్రాంతంలోకి తరలించి వంద ఎకరాల స్థలంలో నిర్వహించాలని సూచించారు. నగర శివారుకు ఎగ్జిబిషన్‌ను తరలిస్తే ట్రాఫిక్ సమస్యలు తీరడంతో పాటు సందర్శకులకు ఇబ్బందులు ఉండవని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని గతంలో అసెంబ్లీలో కూడా చర్చించినట్లు తెలిపారు. నుమాయిష్ స్టాల్స్ అలాట్‌మెంట్‌లో అవకతవకలు జరిగాయని, దీని వలన మంత్రులకు లాభం చేకూరుతుందని పేర్కొన్నారు. నుమాయిష్ వెళ్లేందుకు సందర్శకులు రూ. 50 చెల్లిస్తే, నాంపల్లిలోని ఓ కళాశాలలో సందర్శకులు పార్కింగ్ చేస్తే బైక్‌నకు రూ.60, కారునకు రూ. 150 తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమంగా డబ్బులు వసూలు చేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ ఛాంపియన్ షిప్ ప్రారంభం

అంబర్‌పేటలో రాజీవ్‌గాంధీ ఆల్ ఇండియా
అండర్ క్రికెట్ టోర్నీని బ్యాటింగ్ చేసి
ప్రారంభిస్తున్న దీపాదాస్‌మున్షి

గోల్నాక, జనవరి 21 : అంబర్‌పేటలో 18వ రాజీవ్‌గాంధీ ఆల్ ఇండియా అండర్-19 టీ20 డే అండ్ నైట్ ఛాంపియన్ షిప్-2025 అట్టహాసంగా ప్రారంభమైంది. మంగళవారం అంబర్‌పేట జలమండలి క్రికెట్ మైదానం వేదికగా క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, తమిళనాడు మాజీ ఎంపీ విశ్వనాథన్ తదితరులు హాజరై టోర్నీని ప్రారంభించారు. ఈ ఛాంపియన్ షిప్‌లో మలేషియా, శ్రీలంక, బెంగుళూరు, చెన్నై, మహారాష్ట్ర, మంగళూరుతో పాటు తెలంగాణ జట్లు పాల్గొంటున్నాయి. ఈ కార్యక్రమంలో సీఎఫ్ఐ హైదరాబాద్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శంభుల శ్రీకాంత్‌గౌడ్, అధ్యక్షుడు ఆదిల్ అవినాష్, సీపీఎఫ్ అధ్యక్షుడు సాధిక్ భాషా, ప్రతినిధులు అమర్జీత్ కుమార్, రజనీకాంత్, మహేందర్, షకీల్, మన్‌మోహన్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కుస్తీ వీరులకు సన్మానం

ముద్గర్ అఖాడా రెజ్లింగ్ పోటీలు కులీకుతుబ్‌షా స్టేడియంలో సోమవారం పూర్తి అయ్యాయి. ఈ పోటీలలో కార్వాన్ నియోజకవర్గం సబ్జిమండికి చెందిన వీరాభిమన్యు వ్యాయామశాలకు చెందిన కట్ట గని శంకర్ 70 కేజీల విభాగంలో, కట్టసాయిశంకర్ 97 కేజీల విభాగంలో పతకాలను సాధించారు. వీరిని మంగళవారం సబ్జిమండి గంగపుత్ర సంఘం అధ్యక్షుడు దోర్తుల శ్రీనివాస్, మత్స్య సంఘం అధ్యక్షుడు కట్టలింగం తదితరులు సన్మానించి అభినందించారు.

– మెహిదీపట్నం, జనవరి 21

మంచి నీటి సమస్యలు పరిష్కరించండి

మెహిదీపట్నం జనవరి 21: ప్రజలకు మంచినీటి సమస్యలు లేకుండా చూడాలని నాంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ జలమండలి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం రెడ్ హిల్స్ జలమండలి కార్యాలయంలో జీఎం జానీ షరీఫ్‌ను ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ సూచనలతో మల్లేపల్లి ఎంఐఎం నాయకుడు జాఫర్‌ఖాన్ కలిసి మల్లేపల్లిలో నీటి సమస్యలపై ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన జలమండలి జీఎం జానీ షరీఫ్ తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ, జనవరి 21: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ హెడ్‌కానిస్టేబుల్ చిమ్మానాయక్ వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(55)మంగళవారం విద్యానగర్-కాచిగూడ రైల్వేస్టేషన్‌ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనానా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. సిమెంట్ రంగు టీషర్ట్, నీలి రంగు ప్యాంట్ ధరించి, ఎత్తు 5.4 ఉన్నట్లు తెలిపారు. వివరాలకు 8712568495లో సంప్రదించాలని కోరారు.

ఏపీ సంపర్క్‌క్రాంతి రైల్లో దొంగతనం

కాచిగూడ,జనవరి 21: ఏపీ సంపర్క్ క్రాంతి రైల్లో ప్రయాణికుని ల్యాప్‌ట్యాప్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. కర్నూల్‌లోని వెల్దుర్థి ప్రాంతానికి చెందిన శ్రీహరి(19)ఏపీ సంపర్క్‌క్రాంతి రైల్లో కాచిగూడకు వస్తుండగా కర్నూల్ రైల్వేస్టేషన్ సమీపంలో బ్యాగును చూసుకునే సరికి గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. అందులో ల్యాప్‌ట్యాప్ ఉన్నట్లు తెలిపారు. మంగళవారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని కర్నూల్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు రైల్వే సీఐ తెలిపారు.

గుడిమల్కాపూర్‌లో ఇద్దరు దొంగలు అరెస్టు

కార్వాన్, జనవరి 21 : చోరీలకు పాల్పడుతన్న ఇద్దరు దొంగలను గుడిమల్కాపూర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ భైరి రాజు తెలిపిన వివరాల ప్రకారం.. జనవరి 16న భోజగుట్టలోని వివేకానంద నగర్‌కు చెందిన ఉప్పరి క్రిష్ణ తన గ్రామానికి వెళ్లారు. తిరిగి వచ్చే సరికి ఇంట్లో దొంగతనం జరగినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు విశ్వసనీయ సమాచారం మేరకు పాత నేరస్తులైన ఎరికి పవన్, సయ్యద్ అజీం అనే ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనానికి పాల్పడినట్లు ఒప్పుకున్నారు. నిందితుల నుంచి 42 గ్రాముల బంగారు ఆభరణాలు, 756 గ్రాములున్న వెండి వస్తువులు, రూ.1,87,000 నగదుతో పాటు యాక్టీవా, ఒక ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.

నేరస్తుల ప్రవర్తనలో మార్పులకు చర్యలు చేపట్టాలి

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జనవరి 21 (నమస్తే తెలంగాణ) : వరుసగా నేరాలకు పాల్పడుతున్న వారి స్థితిగతులను పరిశీలించి వారి ప్రవర్తనలో మార్పులకు చర్యలు చేపట్టాలని, అందుకోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి మానసిక నిపుణులు మైథిలి వివరించారు. హైదరాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మహ్మద్ అబ్దుల్ జావేద్ పాషా నేతృత్వంలో లీగల్ వాలంటీర్ల కోసం మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. ప్రధానంగా పిల్లలపై తల్లిదండ్రుల, పరిసరాల ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుందని, నేరాలకు పాల్పడే అనుకూల వాతావరణానికి దూరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లలపై కుటుంబీకుల ప్రేమానురాగాలు, వారి మానసిక ఎదుగుదలకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. నేరాలు జరిగే పరిసరప్రాంతాలకు దూరంగా విద్యాసంస్థల్ని ఏర్పాటు చేయాలని అన్నారు. మైనర్ బాలబాలికలపై జరుగుతున్న దాడుల పట్ల వారికి చట్టాలపై అవగాహన కల్పించాలని, పిల్లల పెంపకం పట్ల తల్లి దండ్రులు తగు జాగ్రత్తలు పాటించాల్సిన అవసర ముందన్నారు. పిల్లల మానసిక ఆరోగ్యం కూడా ప్రధాన భూమిక పోషిస్తుందని అన్నారు. చిన్నారుల మానసిన శక్తి సామర్థ్యాలకు అనుగుణంగా పెంపకం ఉండాలని వివరించారు. ఆర్థిక, సామాజిక, మానసిక ఒత్తిడిలకు లోనుకాకుండా ఉండాలని, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండలేని పరిస్థితి నెలకొందన్నారు. చెడు ప్రభావాలకు పిల్లలు తొందరగా ఆకర్షితులవుతారన్నారు. నేరాలకు పాల్పడకుండా ఉండేవిధంగా అవగాహన కల్పించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలీంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అమరశిల్పి జక్కన, విశ్వశిల్పి రామప్ప పురస్కారాలు ప్రదానం

అవార్డులు పొందిన వారితో ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి,
మధన్‌మోహన్, లాలుకోట వెంకటచారి, చొల్లెటి కృష్ణామాచార్యులు

రవీంద్రభారతి, జనవరి 21 : విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం, జాతి ఔన్నత్యాన్ని విలువలను పరిరక్షించాలని శాసన మండలి ప్రతిపక్షనేత ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. సంఘం కార్యాలయంలో ప్రతి ఏటా సంఘం అందజేస్తున్నప్రతిష్టాత్మక సుప్రసిద్ధ అమరశిల్పి జక్కనాచార్యపురస్కారం, విశ్వశిల్పి రామప్ప పురస్కారాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మధన్‌మోహన్, గౌరవ అధ్యక్షుడు లాలుకోట వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి చొల్లెటి కృష్ణామాచార్యులు, రంగారెడ్డి జిల్లా సంఘం అధ్యక్షుడు పులిగిళ్ల శ్రీనివాసాచారి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు పబ్బోజు భిక్షపతి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు దేవరకొండ వీరాచారి, రాళ్లబండి విష్ణుచారి విచ్చేసి పలువురికి పురస్కారాలను అందజేసి సత్కరించారు. వీణవంక సదానందానికి విశ్వశిల్పి రామప్ప పురస్కారం, మంజంపెల్లి సోమబ్రహ్మ నరసింహాచారికి అమరశిల్పి రామప్ప పురస్కారం, కాశ అంజయ్యచారి, కనపర్తి రామరత్నమాచార్యులకు పురస్కారాలను అందజేసి సత్కరించారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

కోఠిలోని చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయం ఆవరణలో మొక్క
నాటుతున్న సైక్లిస్ట్ పప్పు రామ్‌చౌదరి, వర్సిటీ వీసీ సూర్యధనుంజయ్

సుల్తాన్‌బజార్, జనవరి 21 : పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం కోఠిలోని వర్సిటీ ఆవరణలోని దర్బార్ హాల్ వద్ద రాజస్థాన్‌లోని నాగౌర్‌కు చెందిన సైక్లిస్ట్ పప్పు రామ్‌చౌదరి దేశవ్యాప్త యాత్రలో భాగంగా వర్సిటీ వీసీతో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం భారత దేశం అంతటా సైక్లింగ్‌తో పప్పు రామ్ చౌదరి గిన్నిస్ వరల్డ్ రికార్డును బద్దలు కొట్టాడని అన్నారు. 24 నెలల్లో 60 వేల కిలోమీటర్లకు పైగా రైడ్ చేయడం అభినందనీయమని అన్నారు. 2023 ఏప్రిల్ 25న సైక్లింగ్ యాత్రను ప్రారంభించి రాజస్థాన్, హర్యానా, చండీఘడ్, పంజాబ్, జమ్మూ కాశ్మీర్, లద్దాఖ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, దాద్రానగర్ హవేలి, డామన్, మహారాష్ట్ర, గోవా, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ యాత్ర పూర్తి చేసుకొని తెలంగాణలో సందర్శిస్తున్నారని అన్నారు. తదనంతరం 2026లో భారతీయ, రోటరీ జెండాతో సైక్లిస్ట్ రామ్‌చౌదరి 'మిషన్ ఎవరెస్ట్ సమ్మిట్' నిర్వహిస్తారని అన్నారు. పర్యావరణం కోసం ప్రచారం నిర్వహిస్తున్న పప్పు రామ్‌చౌదరిని ఆమె సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఈస్ట్ క్లబ్ అధికారులు, వర్సిటీ పీఆర్‌వో డాక్టర్ కృష్ణాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

సైఫాబాద్ సైన్స్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్‌గా అరవింద్

మాసబ్‌ట్యాంక్‌లోని సైఫాబాద్ సైన్స్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ అరవింద్ నియమితులయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. శైలజ కళాశాల కెమిస్ట్రీ విభాగానికి చెందిన డాక్టర్ అరవింద్‌ను వైస్ ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ నియామక పత్రాన్ని అందించడంతో ఆయన బా